# ముత్యాలమ్మ

"అల్లుడు ఉత్తరం వ్రాశాడే! కార్యంవేసుకొని భార్యని తనతో తీసికెళ్ళిపోతాడట. మూడు రోజులకంటే ఎక్కువలేదట సెలవు! అమ్మాయిని తనతో పంపడానికి సిద్ధంగా వుంచమన్నాడు!"

"ఎప్పుడొస్తున్నాడు?" అల్లుడొస్తున్నాడంటే, అదీ కార్యం చేసుకోడానికి వస్తున్నాడంటే కంగారు పడిపోయింది మీనాక్షి.

"పదిహేనోతారీకు....అంటే...." ఆయన కాలెండరుకేసి చూసి. "రేపేనే!" అని అరిచాడు హడావిడిగా.

"కాస్త ముందు వ్రాయకూడదూ? ఇంత హఠాత్తుగా ఎలా? బట్టలు కొనాలి. కుట్టించాలి, పిండివంటలు....కనీసం లడ్డు, బూంది అయినా చేయాలి! చుట్టపక్కాలందరినీ పిలువకపోయినా కాస్త దగ్గరివాళ్ళనైనా పిలవొద్దూ?"

"మాఅమ్మాయికి కార్యమంటూ దండోరా వేయిస్తావా ఏమిటి? ఇదేం వెనుకటి కాలమా? నువ్వు కార్యం కార్యమంటూ గొడవచేస్తే బాగుండదు!" కార్యం కావలసినపిల్ల -సుమిత్ర కసిరింది. ఆమె మనసులో ముల్లు సెలవేసినట్టుగా ఉంది, భర్త తనకి ఉత్తరం వ్రాయలేదే అని!

నెలరోజుల క్రితం సుధాకర్‌తో పెళ్ళి అయింది సుమిత్రకు. పెళ్ళయిన మరురోజు శోభనం చేయాలనుకొన్నారు పెద్దలు. సెలవు లేదంటూ వెళ్ళిపోయిన సుధాకర్ ఇప్పుడీ ఉత్తరం వ్రాశాడు! 'డియర్ సుమిత్రా!' అంటూ తనకి ఒక ఉత్తరం....మనసు, ప్రేమ విప్పిచెప్పే ఉత్తరం వ్రాయాలనిపించలేదా? తను మాత్రం అతడు వెళ్ళిన మరురోజునుండి అతడినుండి వచ్చే ఉత్తరం కోసం ఎదురుచూస్తోంది!

కాని, ఆ ఉత్తరం తనకి రాలేదు. తన తండ్రికి వ్రాశాడు!

* * *

"రా, అల్లుడూ! ప్రయాణం కులాసాగా జరిగిందా? ఒసే, సునీతా!బావొచ్చాడు.కాళ్ళకు నీళ్ళు పట్రా!" కామేశ్వరరావు పంచె పైకి ఎగవేసుకొంటూ కంగారుగా కేకపెట్టాడు.

సునీత చెంబుతో నీళ్ళు పట్టుకు వచ్చింది.

సుధాకర్ బాగ్ గోడవారగా పెట్టి వీధి మెట్ల మీద కాళ్ళు కడుక్కు వచ్చాడు.

టీ యివ్వడం, కుశల ప్రశ్నలూ అయ్యాయి.

'అమ్మకీ, నాన్నకీ ఉత్తరంవ్రాసేవ్యవధి లేకపోయింది. మీ ఉత్తరం నిన్నే వచ్చిందామా?"

సుధాకర్ కళ్ళు ఆత్రుతతగా సుమిత్రకోసం చూస్తున్నాయి! ఇంతసేపైనా ఆమె అతడి కంటపడలేదు! సిగ్గు కాబోలు! రాత్రికి యీ సిగ్గంతా ఎక్కడ దాచేస్తుందో?

మీనాక్షి కొంగునిండా కప్పుకొని తలుపు వార నిలబడి అల్లుడిని క్షేమసమాచారాలడిగింది. తరువాత భర్తకి సైగ చేసి పిలిచింది.

"చెప్పారా?"

"నెమ్మదిగా తెలుస్తుంది. గుమ్మంలో కాలు పెడుతూనే అమ్మాయి బయటుందని ఎలా చెప్పేది" విసుక్కొన్నాడు కామేశ్వరరావు.

"పాపం! అబ్బాయి కార్యం చేసుకోవాలని గంపెడంత ఆశతో వస్తే...."

"అతడు కాస్త ముందుగా ఉత్తరం వ్రాసి వుంటే అమ్మాయికి నెల ఉన్న సంగతి వ్రాసేవాడిని! వ్యవధిలేకుండా వస్తే యేం చేసేది?"

భోజనాల దగ్గరైనా సుమిత్ర కనిపిస్తుందేమో అనుకొన్న సుధాకర్‌కి ఆశాభంగం అయింది. వచ్చి యింతసేపైనా తన కళ్ళబడని సుమిత్రమీద కోపం తెచ్చుకొన్నాడు. మరీ ఇంత సిగ్గా!

భోజనంచేసి హాల్లోకి వచ్చి కూర్చున్నాడు సుధాకర్.

'బావా! అక్క పిలుస్తోంది!" సునీత వచ్చి పిలిచింది.

"ఎక్కడుంది?"

"దక్షిణంగదిలో. నాతోవస్తే వెదుక్కునే శ్రమ తప్పుతుంది."

మరదలిని అనుసరించాడు సుధాకర్.

చెంబు పక్కనుంచుకొని చాప మీద కూర్చొన్న సుమిత్రను చూసేసరికి సుధాకర్ గుండెలో రాయిపడింది!

"చంపావ్ పో!" వెంట మరదలుందని మరిచిపోయాడు.

"కూర్చో, బావా!" కుర్చీ చూపించి వాళ్ళిద్దరినీ ఏకాంతంలో వదలివెళ్ళింది సునీత.

"ఇప్పుడే తీరిందా?"

"సరిగా నెల!" కొంటెగా నవ్వింది సుమిత్ర.

"అవునుగాని చెంబు, మూట పక్కన పెట్టుకుని మూలకి కూర్చోవడం అసహ్యంగా ఉండదూ? స్నానం చేసెయ్యి! సాయంత్రం అలా చెరువుగట్టుకేసి షికారు వెడదాం!"

"స్నానంచేయడమా? అమ్మ ఒప్పుకోదు. మైల కలిస్తే తేళ్ళు లేస్తాయి ఈ ఇంట."

"పిచ్చి! తేళ్ళకీ, మైలకీ సంబంధమేమిటసలు? చెత్తా చెదారం ఉంటే తేళ్ళు రావడానికి అవకాశముందిగాని!"

"ఈ ఇంటిదేవుడు వెంకటేశ్వరస్వామి. కాస్త మైల కలిస్తే తేళ్ళు తప్పకుండా లేస్తాయి! ప్రతిశనివారం కొండికాసులు వేసి మొక్కుతుంది అమ్మ!"

"ఈ మూడు రోజులు నిన్ను చూస్తూ కూర్చోనా? స్నానం చేసెయ్యి. రేపు ఊరికి వెళ్ళిపోదాం!"

సుమిత్ర వెళ్ళి తల్లితో చెప్పింది.

ఆవిడ ఒప్పుకోలేదు. "ఈ మూడురోజులుండి స్నానం చేశాక తీసికెళ్ళొచ్చుగా?"

"ఆయన రేపే ఊరికి వెళ్ళిపోదామంటున్నారు."

"కాస్త పసుపుకుంకుమ ఇవ్వకుండా ఎలా పంపించేదే? స్నానంపోసి ఇంట్లో కలుపుకోడానికి బోలెడంత దేవతార్చనా,సాలగ్రామాలు ఉన్నాయి!"

అదే సంగతి భర్తతో చెప్పించింది మీనాక్షి, అల్లుడికి.

"అయితే నేను రేపు వెళ్ళిపోతాను. మంచిరోజు చూసి మీ అమ్మాయిని తీసుకు రండి!"

అల్లుడికి కాస్త కోపం వచ్చిందని గ్రహించిన కామేశ్వరరావు, "అమ్మాయికి స్నానం పోసెయ్యి. అల్లుడు అమ్మాయి కలిసి వెళ్ళిపోనీ" అని చెప్పాడు మీనాక్షితో.

"కాదండీ! ఇలాంటప్పుడా వాళ్ళిద్దరినీ ఒంటరిగా వదలడం?"

పోల్కంపల్లి శాంతాదేవి

"చదువుకొన్నవాడు. ఆ మాత్రం ఆరోగ్యం గురించి తెలీదా?"

సునీతను తోడిచ్చి పంపారు సుమిత్రను.

*　　　*　　　*

రాత్రి భార్యతో దొరికిన ఏకాంతం రెచ్చగొడుతూంటే ఆమెకు దూరంగా ఉండలేకపోయాడు సుధాకర్. ఆమెను స్పర్శించడంలో హాయి ఓవైపు మత్తెక్కిస్తూంటే, మరోవైపు వివేకం హెచ్చరించింది.

తొలి సమాగం మధురస్మృతిగా నిలిచిపోవాలి! అందులో ఎలాంటి అపశ్రుతీ పలుకకూడదు!

"ఉహుం. వద్దు!" తనను అల్లుకుపోయిన ఆమెను తోసేశాడు. తన పక్క, పక్క గదిలోకి మార్చుకొని, "తలుపు గడియ వే[illegible]" అన్నాడు.


హఠాత్తుగా భర్త కౌగిటినుండి దూరమైన సుమిత్ర ఆ రాత్రి అంతా పక్కమీద [illegible]గింతలు పెడుతూనే ఉన్నది!

*　　　*　　　*

సుధాకర్ మధ్యాహ్నం ఆఫీసుకు వెళుతూ తెల్లచీర, తెల్ల రెవిక సుమిత్రముందుంచి ఆమె చెవిలో మధుర రహస్యం చెబుతున్నట్టుగా అన్నాడు: "దేవతలా తయారవ్వాలి! రాత్రికి మనం స్వర్గంలో వుండాలి!"

సుమిత్ర నిరాసక్తంగా చూసింది.

సుధాకర్ ఆఫీసు నుండి వచ్చేసరికి సుమిత్ర జుట్టు విరబోసుకొని పక్కమీద బోర్లా పడుకొంది!



"ఏమ్, సుమిత్రా! ఏం చెప్మా ము! నేను వచ్చేసరికి తయారవమనలేదూ?" సుమిత్ర భుజాలు పట్టుకొని ఇటు మలిపాడు సుధాకర్.

ఆమె కళ్లు అరమూతలు పడి న్నాయి. కుంకుమ చెదిరి తోకచుక్కలా అగుపడుతోంది. ఉలుకుపలుకు లేదు. అతడి గుర్తించినట్టుగా కూడాలేదు!

"ఏమైంది? ఒంట్లో బాగాలేదా?" సుధాకర్ ఉత్సాహం నీళ్లుచల్లిన పాలపొంగులా అణగారిపోయింది. అవతలి గదిలో ప త్రిక తిప్పేస్తున్న మరదలిని పిలిచాడు. "ఏమైంది మీ అక్కకు? పలకడం లేదు?"

సునీత భయంగా చెప్పింది. "అక్కకి మధ్యమధ్య ఇలా అవుతుంది, బా !"

"ఇలా అంటే ఎలా?" కాస్త ఉద్రిక్తత తొంగిచూసింది అతడి గొంతు . తన భార్య రోగిష్టిదా? రోగిష్టిదానితో త జీవితం ముడిపడిందా?

"ఏడుస్తుంది. నవ్వుతుంది. త లో తను మాట్లాడుకొంటుంది. మా వాళ్లు గాలిచేష్ట అని మంత్రం వేయించేవాళ్ళు. మంత్రగాడు మంత్రిస్తూ కొడితే 'పోతాను ఈ సారి రాను' అంటుంది. మళ్లీ రెణ్ణెల్లకీ నెలకీ తయారు! నువ్వెవరివని అడిగితే మా అమ్మ మ్మ పేరు చెబుతుంది!"

తొలిముద్దలో కంకెడురాయన్న గామెతగా ఉంది పరిస్థితి. తన భార్యకి యమో, రోగమో! ఆరోగ్యవంతురాలైన మ షికాదు!

పక్కమీద అస్థిమితంగా కద లుతున్నది సుమిత్ర.

"అన్నం తిన్నదా?"

"తిన్నది."

సుధాకర్ పోస్టాఫీసుకి వెళ్లి మగారికి టెలిగ్రాం ఇచ్చాడు, "సుమిత్రకి ఆరోగ్యం బాగుండలేదు. మీరు, అత్తయా వెంటనే రండి" అంటూ.

మరునాటికల్లా దిగారు వాళ్లు.

కూతురి పరిస్థితి గమనించి అల్లుడిముందు నేరస్తుల్లా తలవంచారు. "ఈ మధ్య సంవత్సరంగా ఎలాంటి ఇదీ లేదు. మళ్ళీ ందుకిలా జరిగిందో!" అన్నాడు కామేశ్వరరావు. దెయ్యంపట్టి ఊగే మనిషి నాకక్కరలేదనీ పిల్లని అతడెక్కడ వదిలేస్తాడోనని భయం పట్టుకుంది.

ఇలాంటి మనిషిని నాకెందుకంటగట్టారని దులపాలనిపించినా వాళ్ల ముఖాల్లో కనిపిస్తున్న దైన్యం, భయం చూసి ఏమనలేకపోయాడు సుధాకర్.

"సుమిత్రా! ఎలా వుందమ్మా?" మీనాక్షి కూతుర్ని ట్టి పిలిచింది.

సుమిత్ర దిగ్గున లేచింది. "వచ్చావా, మీనాక్షీ? ఆకలి మండిపోతుందే! వేడివేడి అన్నం వాలి! వంకాయకూర తిని ఎన్నాళ్ళయిందో! త్వరగా చేయవే!"

ఈ మాటలు, ఈ వ్యవహారమంతా మీనాక్షమ్మకు కొత్త కాకపోయినా ఇదంతా ఈ కొత్తల్లుడిముందు జరగడం తలకొట్టేసినంత పనిగా వుంది! "నీ ముఖానికి వంకాయ కూరకాదు. కొరివి పెడతాను!" పళ్ళు కొరికింది.

సుమిత్ర నవ్వింది. విలాసంగా, తమాషాగా! "ఎందు ఇట్లానే అంటావు! అయినా చేసిపెడతావు! ఆ చేసేదేదో త్వరగా చెయ్యి! ఆకలి మండిపోతూంది! నెలకో రెణ్ణెల్లకో వస్తాను! అమ్మకింత అన్నం పెట్టడానికి అలా మండిపడతావేమే? పెరుగుముద్దలు పెట్టి నిన్నెలా పెంచానే?...."

"అమ్మా! నువ్వెంత రాక్షసివే! పెళ్ళయిన పిల్ల! దాని కాపురం కూలదోయడానికి ఇక్కడా తయారయ్యావా?" ఆవిడ రుద్ధంగా అడిగింది.

"దాని కాపురానికి నేనేమీ అడ్డురాను!"

"నువ్వు చేస్తున్న దేమిటి?"

"నేనే చేయడంలేదు. ముందు నా ఆకలి తీర్చు. లేకపోతే నీ పిల్లను నాతో తీసికెళ్ళిపోతాను!"

అరగంటలో వంటచేసి, "దా, పిండం తిందువు!" అని కపిగా పిలిచింది మీనాక్షి.

"నా క రేదీ?"

"మనుశ్శో వుంది!"

"కిందపడతాను. కాస్త చెయ్యి ఆసరా ఇవ్వవే!"

మీనాక్షి చెయ్యి ఆసరాతో నడుం వంచి ముసలిదానిలా నడిచిపోతున్న సుమిత్రను కళ్ల మిటకరించి చూడసాగాడు సుధాకర్.

సుమిత్ర భోంచేసివచ్చి "మీనా! పొందాన ఏదే?" అని అడిగింది.

"పొందాన లేదు ఏంలేదు."

"నాలిక చుట్టుకుపోతోంది. పొడుకొంప. ఆకువక్కలు పెట్టుకోరూ?"

అంట్లు తోమడం మానేసి ఈ తమాషా చూస్తున్నది పనిమనిషి.

"ఏమే నీదగ్గర ఆకుసంచి ఉందా?" సుమిత్ర అడిగింది.

"ఉంది" రొంటిలోంచి ఆకుసంచీ తీసింది పనిమనిషి.

"పొగాకుందా?"

"ఉంది."

ఆకుతోపాటు పిడికెడు పొగాకు దవడకు పెట్టుకొని కసకస నమలసాగింది సుమిత్ర.

కుర్చీలో తల పట్టుకు కూర్చున్నాడు సుధాకర్.

ఆకురసం రెండుసార్లు ఉమ్మివేసి వచ్చి పడుకుంది సుమిత్ర. మగతగా కళ్ళు మూసుకొని అయిదునిముషాలు పడుకొందో లేదో లేచి భళ్ళున వాంతి చేసుకొంది.

తల్లి చెవులు మూసి పట్టుకొంది.

ముసలమ్మ యిష్టంగా తిన్న వంకాయ కూర, ఆకు పొగాకు అన్నీ వాంతిలో పోయాయి!

సుమిత్రకు నోరు కడిగింది, పడుకోబెట్టి గది శుభ్రంచేసింది తల్లి.

"ఎప్పుడొచ్చారమ్మా మీరు?" నీరసంగా అడిగింది సుమిత్ర.

"ఇంతకుముందే, నీకు ఆరోగ్యం బాగుండలేదని అల్లుడు టెలిగ్రాం ఇచ్చాడు. ....ఎలా ఉందమ్మా?"

"నీరసంగా వుందమ్మా! కళ్ళు తిరుగుతున్నాయి! నోరంతా పొగాకు కంపు!" వాసనకు మళ్ళీ డోక్కొబోయింది.

లవంగం, ఏలాకు నమిలించి, "కాస్సేపు కళ్ళు మూసుకు పడుకో, తల్లీ!" అంది మీనాక్షి.

"ఆకలేస్తోందమ్మా! నిన్నటినుండీ అన్నం లేదు."

'హతోస్మి' అనుకొన్నాడు సుధాకర్. కట్టుకొన్న పెళ్ళానికే అన్నం పెట్టడం కష్టంగా ఉన్న ఈ రోజులలో దీనికే కాక దీని అమ్మమ్మకి కూడా వంకాయకూరలు వగైరాలు మేపుతూ పోవాలా?

మూడురోజులు ఇదే పద్ధతిన సాగింది వ్యవహారం.

అమ్మమ్మ ఒంటిమీదికి రావడం, తన కిష్టమైనవి మీనాక్షితో చేయించుకు తినడం కాస్సేపు నవ్వి, కాస్సేపు ఏడ్చి, ఏదో వాగివాగి దిగిపోవడం, సుమిత్ర మామూలుగా లేచి తన వంతు భోజనంచేసి నీరసంగా పక్కమీద పడుకోవడం!

వాళ్ల ఊళ్లో అయితే మహబూబ్ అనే మంత్రగాడు మంత్రించేవాడట. 'పోతున్నా, పోతున్నా' అంటూ దిగిపోయి మళ్ళీ నెలకో,

రెణ్ణెల్లకో వచ్చేదట!

మంత్రగాడు లేకపోతే దెయ్యం దిగిపోదని పనిమనిషి సాయంతో ఒక మంత్రగాడిని సంపాదించారు కామేశ్వరరావు, మీనాక్షీ.

అతడి పేరు యాదగిరి. జులపాలు పెంచుకొని, ముఖాన పెద్ద బొట్టు పెట్టుకొని చూడగానే ఒక ప్రత్యేకత కన్పిస్తేట్టుగా ఉన్నాడు.

సుమిత్రను కాస్సేపు పరిశీలనగా చూశాడు 'గాలి చేష్ట' అని తేల్చేశాడు. నిమ్మకాయలు, సాంబ్రాణి, మస్తాన్ అగరుబత్తీలు తెమ్మన్నాడు. అన్నీ వచ్చాక, మంత్రాలు చదువుతూ, సుమిత్ర నడినెత్తిన వెంట్రుకలు పాయగా తీసి గుంజి పట్టుకున్నాడు.

"ఎవరు నువ్వు?"

"నా పేరు రాములమ్మ!"

"నిజం చెప్పు."

"నిజమే చెబుతున్నాను."

యాదగిరి కళ్ళెర్రజేసి వేపమండతో ఛెళ్లన కొట్టాడు. "నిజం చెప్పు లేకపోతే నా చేతిలో భస్మమైపోతావ్!" గర్జించాడు.

సుమిత్ర ఏడవసాగింది.

"ఈ వగలమారి ఏడుపులు నా దగ్గర సాగవు. చెప్పు" మరోదెబ్బ కొట్టాడు.

"చెబుతా. కొట్టకు! నా పేరు ముత్యాలమ్మ! అత్తపోరు పడ్లేక చెర్లోపడి చచ్చినా! లంగాలు వేసుకొనే ప్రాయంలో ఈ పిల్ల చెర్లో ఈతకొడుతూ అడుగున వున్న నా శవాన్ని పైకి తెచ్చింది! అప్పుడే ఈ బాలమీద పూనినా!"

"నిజమేనా నువ్వు చెప్పేదంతా?"

"నిజం!"

"మీ అమ్మాయి చెర్లో శవాన్ని తీయడం నిజమేనా?" కామేశ్వరరావుని అడిగాడు యాదగిరి.

"నిజమే. పదేళ్ళ వయసప్పుడు చెరువులో ఈతకొడుతూ ఏదో అనుకోని శవాన్ని పైకి ఈడ్చుకు వచ్చింది! తాను తీసింది శవమని తెలిసి, నీళ్ళలో ఉబ్బిపోయిన ఆ ఆకారంచూసి అక్కడే భయంతో మూర్ఛపోయింది.పక్కనే జత పిల్లలుండబట్టి బ్రతికిపోయింది గాని లేకపోతే ఆ చెర్లోనే ప్రాణాలు పోయేవి పిల్లవి!"

"ఏమే? నువ్వు ముత్యాలమ్మవైతే రాములమ్మ పేరెందుకు చెబుతున్నావు?"

"రాములమ్మ పేరు చెప్తే కొంచెం నన్ను ప్రేమగా చూసుకొంటారని!"

'అమ్మో? దెయ్యాలకీ బ్రతికే తెలివితేటలుంటాయన్న మాట!' హాస్యంగా అనుకొన్నాడు సుధాకర్.

"ప్రేతమై పట్టిన నిన్ను ప్రేమగా చూడాలేం? నీకు చెప్పుదెబ్బలే ప్రాప్తం! చెప్పు. ఈ అమ్మాయిని వదిలిపెడతావా లేదా?" ఓచేత పాయగా తీసిన జుట్టు మెలేసి పట్టుకొని, మరోచేత వేపమండతో కొట్టసాగాడు.

సుమిత్రలో తీవ్రమైన బాధ వ్యక్తమైంది. "పోతా, పోతా. కొట్టకు, కొట్టకు."

"కొట్టడం కాదు.మళ్ళీవస్తే కాల్చి భస్మం చేస్తాను!"

చేత్తో గుంజిపట్టిన పాయను ఏవో మంత్రాలు చదువుతూ ముడివేశాడు యాదగిరి. నిమ్మకాయలు కోసి సుమిత్ర తలచుట్టూ తిప్పి పారేశాడు. నిప్పు తెప్పించి సాంబ్రాణి పొగ పట్టాడు.

"అబ్బా! మంటలు. ఒళ్లంతా మంటలు!" బొబ్బలు పెడుతూ క్రింద పడిపోయింది సుమిత్ర.


"దెబ్బకు దెయ్యం వదిలింది! కొంచెం సేపటికి స్పృహ వస్తుంది. తీసికెళ్ళి స్నానం పోసి పడుకోబెట్టండి. ఇంకెప్పుడూ అమ్మాయి మీదికి దెయ్యం రాకుండా చెట్ల మూలికలతో తాయెత్తు కడతాను."

"ఎంతవుతుంది?"

"మూలికలకోసం మనుషుల్ని అడవికి పంపాలి! కనీసం వందయినా కావాలి!"

అదంతా పీకుడు వ్యవహారమని తెలుస్తూనే ఉన్నా డబ్బుదగ్గర ఆలోచిస్తూ కూర్చొనే పరిస్థితి కాదాయె. వందరూపాయలు తీసి ఇచ్చాడు కామేశ్వరరావు.

టెంకాయ పేలనందువల్ల ....



....ప్రమాదం పక్కనే ...

మరునాటినుండి కాస్త తేలిగ్గా ఉండసాగింది సుమిత్ర.

రెండు రోజుల్లో మిగతా కార్యక్రమం పూర్తిచేశాడు యాదగిరి. "ఇక జన్మలో దెయ్యం రాదు" అని హామీ ఇచ్చి తన కట్నం నూటపదహార్లని చెప్పి డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు.

* * *


అగరువత్తుల వాసన అల్లుకుపోయిన గదిలో.తల్లి చేసినముస్తాబులో తెల్లచీర కట్టుకొని దేవకన్యలా మెరిసిపోతూ మంచంమీద కూర్చొని ఉంది సుమిత్ర. ఆమె తల్లో, ఆ పొడవునా విచ్చుకొన్న మల్లెలు సిగ్గు పడిన ఆడదానిలా మగవాడికి ఆహ్వానం పలుకుతున్నాయి!

రాత్రి పదిగంటలవరకూ చదువుకొని బెడ్ రూంలోకి అడుగుపెట్టిన సుధాకర్ గదిలో కన్పించిన ఈ దృశ్యానికి ఉత్తేజితుడై పోయాడు. సుమిత్ర చేసిన హంగామా ఆ చప్పున మరిచిపోలేకపోతున్నాడతడు!

భర్త రావడం చూసి సిగ్గుతో లేచి నిలబడింది సుమిత్ర.

పరుపుమీదినుండి బెడ్‌షీట్, తలగడా తీసి ఇస్తూ, "నువ్వు పూర్తిగా ఆరోగ్యవంతురాలివయ్యేదాకా మనం ఆ స్వర్గానికి ఇంకా వేచి వుందాం!" అన్నాడు చిరునవ్వుతో.

సుధాకర్ సుమిత్ర ముఖంలోకి చూసి




ఉంటే ఆమె ఆ క్షణంలో పొందిన ఆశా భంగం చూడగలిగేవాడు.

మధ్యరాత్రి,

మంచం పక్కన క్రింద పడుకొన్న సుమిత్ర కెవ్వున కేకపెట్టి లేచి కూర్చొంది.

"ఏమైంది, సుమిత్రా? కల వచ్చిందా?"

"ఉహూఁ. నేను నిద్రపోనేలేదు. తల వెనుక ఎవరో నడిచివస్తున్నట్టు అడుగుల సవ్వడి వినిపించింది. కొంచెంసేపటికి నా తలదగ్గర నిలబడి శ్వాస పీలుస్తున్నట్టుగా వినిపించింది. నేను అరవాలనుకొన్నానుగాని అరవలేకపోయాను. కళ్ళు తెరచి చూడాలనుకొన్నాను గాని చూడలేకపోయాను. నా ఒళ్లంతా ఒణుకుతో నిండిపోయింది. నా పొట్టమీద ఎవరో కూర్చొన్నట్టుగా గొంతు పిసుకుతున్నట్టుగా అనిపించింది. ఎంతో ప్రయత్నించిన మీదట గొంతు పెగిలింది!...."

సుమిత్ర శరీరం పిచ్చుకపిల్లలా వణుకుతూంది. ఒళ్లంతా స్నానం చేసినట్టు చెమటతో తడిసిపోయింది. అప్పుడే పరుగు పందెం ముగించివచ్చినట్టుగా గుండెలు ఎగిరెగిరిపడుతున్నాయి! కళ్లలో విపరీతమైన భయం!

సుధాకర్‌కి జాలేసింది.

స్వతహాగా అతడికి ఈ దెయ్యాలంటే, గాలి చేష్టలంటే నమ్మకం లేదు. కాని, యీ అమ్మాయి అనుభవాలేమిటి? ఇది అంత తేలికగా తీసివేయవలసినవా?

"ఇలారా! నా పక్కమీద పడుకో. నేను మెలుకువతోనే ఉంటాను!" సుమిత్ర చెయ్యి పట్టి తీసికెళ్ళి మంచంమీద పడుకోబెట్టాడు. నిద్ర రాకుంటే ఓ పుస్తకం పట్టుకు కూర్చున్నాడు.

సుమిత్ర నిద్రలోకూడా ఉలిక్కిపడడం అతడు గమనిస్తున్నాడు.

మరునాడు సుమిత్రను వెంటబెట్టుకొని తెలిసిన డాక్టరుదగ్గరికి వెళ్లి సుమిత్ర కేసుకు సంబంధించిన వివరాలన్నీ చెప్పాడు.

డాక్టరు సుమిత్రను ప్రశ్నించసాగాడు.

"చూడమ్మా నీ శరీరంలో ఏమైనా బాధ ఉందా?"

"ఉంటుంది. ఒక్కోసారి ఒక్కోరకంగా. ఒక్కోసారి గుండెలో నొప్పిగా కూడా ఉంటుంది. కొద్దిరోజులు ఏ జబ్బూ లేనిదానిలా హాయిగా ఉంటాను. మరుక్షణంలో చెప్పలేనంత నీరసంగా వుంటుంది! ఒకరోజు ముఖం ఎంతో కళగా వుంటే మరో రోజు పీల్చివేసినట్టుగా, నల్లగా అవుతుంది!"

డాక్టరు ఆమెను అన్ని టెస్టులూ చేశాడు. 'నీ శరీరంలో ఏ జబ్బూలేదు. నువ్వు చాలా ఆరోగ్యంగా వున్నావు!"

"మరి నేను రకరకాలుగా పడే బాధ? మా వాళ్ళు మందులుకూడా చాలా ఇప్పించారు. కాస్తకూడా గుణం కనిపించేదికాదు. గాలిచేష్టవల్లే మందులు శరీరానికి పట్టడం లేదన్న నమ్మకానికి వచ్చేయాల్సి వచ్చింది!"

"నీ కసలు జబ్బుంటూ వుంటే కదా మందులు గుణం ఇవ్వడం, ఇవ్వకపోవడమనేది? నీక ఏ జబ్బూ లేదు? నీమీదికి ఏదో వచ్చి వాలుతావు కదా? నీకు జ్ఞాపకముంటుందా?"

"జ్ఞాపకముంటుంది. కాని, నేను ఎందుకు అలామాట్లాడతానో తెలియదు. అలామాట్లాడకూడ దనుకున్నా నా అదుపులో వుండను!

"చూడమ్మాయ్! ఈ దెయ్యాలూ గియ్యాలనేవి ఒట్టి అభూత కల్పన! అజ్ఞానంతో మనుషులు చేసే ప్రచారాలు! నువ్వు చెరువులో ఈతకొడుతూ శవాన్ని పైకి తీశానన్నావే— అప్పుడు నీ మనసుమీద అతి భీభత్సమైన ముద్రపడి వుంటుంది. దానికితోడు నీకు తెలివి వచ్చాక వాళ్ళు వీళ్ళు భయపెట్టి ఉంటారు! మంత్రగాళ్లు సరేసరి. వాళ్ళ బ్రతుకుదెరువు అదే కాబట్టి ఖచ్చితంగా దెయ్యమేనంటారు. వాళ్ళ మాటలతో, చేతలతో ఒక విధమైన ఉద్రేకం తెప్పించి వాగిస్తారు! పోతే, నువ్వు అలా దెయ్యంపట్టి ఊగేవాళ్ళను చూసి వుంటావు. నీకు తెలియకుండానే అలా చేసేస్తుంటావు!"

"అవును. మా ఊరు బొత్తిగా పల్లెటూరు. మంత్రగాళ్ళకీ, దెయ్యం పట్టి ఊగేవాళ్ళకీ తక్కువలేదు!"

"ఎన్నో రకాలైన హిస్టీరియాల్లో ఇది ఒకరకం హిస్టీరియా! మనసును ప్రశాంతంగా, నిర్మలంగా ఉంచుకోవడంకంటే మించిన మంత్రం, ఔషధం మరొకటి లేదు! మనసు చలనం ముఖం వ్యక్తం చేస్తుంది కాబట్టి, మీ మనసునుబట్టి మీ ముఖంలో రంగులు మారుతాయి!

"చూడండి, మిష్టర్ సుధాకర్! సాధారణంగా ఇలాంటివారిని చేసుకొన్నవాడు, కన్నవాళ్ల అర్థం చేసుకొని సానుభూతినీ సహృదయతనూ చూపగలిగినప్పుడే మనిషిని మామూలు పరిస్థితికి తీసుకురాగలం! మీరు మీ భార్యపట్ల భర్తగాకాదు, మానవత్వమున్న మనిషిగా మసలాలి! ఆమె మీకోసం కాదు, ఆమెకోసం మీరన్నట్టుగా వుండాలి! ఆమె మనసు తెలుసుకోకుండా ఆమెను అసంతృప్తికి గురి చేశారా ముత్యాలమ్మ మీదికి వచ్చేసి మిమ్మల్ని కంగారుపెట్టేస్తుంది!"

డాక్టరుతోపాటు సుమిత్ర, సుధాకర్ నవ్వసాగారు.

"దెయ్యాలనేవి ఈ ప్రపంచంలో లేవని ముందు ఆమె మనసులో దృఢంగా నాటండి! అసలలాటి ఆలోచనలే ఆమెలో రేగకుండా జాగ్రత్తపడండి! ధైర్యం వున్నవాళ్ళని ఏ దెయ్యాలూ ఏమీ చెయ్యలేవని ఎందుకంటారో తెలుసా? మనసులో బలహీనత, అనుమానం ప్రవేశిస్తే అవే భూతాలై మనిషిని భయపెడతాయి! అనుమానం పెనుభూతం అని దీన్నే అని వుంటారు! ఈమెకి మానసికంగా నేనిచ్చే ట్రీట్‌మెంట్ కంటే మీరిచ్చే ట్రీట్‌మెంట్ ఎక్కువ ఉండాలి!"

ముత్యాలమ్మ భయం బాగానే పట్టుకొన్న సుధాకర్ సుమిత్రను అపురూపంగా చూచుకోసాగాడు.

ఏడాది తిరగకుండానే ముద్దులొలికే బాబును కని అతడికి కానుక యిచ్చింది సుమిత్ర!

దెయ్యం పట్టినవాళ్ళని చూస్తే ఇప్పుడు నవ్వు తుందిసుమిత్ర!

కాని ముత్యాలమ్మ చేసిన సహాయాన్ని మరిచిపోదు. దాని భయంచేత తన భర్త తనెంతో అపురూపంగా చూచుకొంటున్నాడు! *